
# పట్నంకాటు

టి. వెంకటేష్



చిరుగుల చొక్కాల మధ్య చుక్కల్లో చంద్రునిలా వెలిగిపోతున్నాడు, రంగుల బట్టల్లో మల్లేషు. అక్కడ చేరిన పిల్లలందరిలో వాడే వయసులో కాస్త పెద్దవాడు. పట్నంలోని హోటలులో పనిచేస్తూంటాడు. తల్లిని చూడటానికి అప్పుడప్పుడూ పల్లెకు వచ్చిపోతూంటాడు.

"అక్కడ పెద్ద పెద్ద మేడలు ... అందులో నాలాగా మెరిసే బట్టల్లో మనుషులు .... కార్లూ, బస్సులూ, సినిమాహాళ్లూ .... అందులో చిరంజీవి ఫైట్లూ, పాటలూ .... ఒక్కటేమిటి ఎన్నో ...!" అంటూ గుక్క తిప్పుకోకుండా పట్నం గురించి చిలవలుపలవలుగా వర్ణింపచేస్తున్నాడు మల్లేషు. వాడి ప్రియనేస్తాలంతా నోళ్లు తెరచి అబ్బురంగా వింటూ, ఊహల ప్రపంచంలో విహరిస్తున్నారు. అందులో ఆరేళ్ల సీను కళ్లింతలు చేసుకుని మరీ వింటున్నాడు.

మల్లేసు తొడుక్కున్న కొత్త బట్టలకేసి అపురూపంగా చూస్తున్నాడు. 'తనూ పట్టణ ఉద్యానవనంలో తుమ్మెదలా ఎప్పుడెప్పుడు వాలిపోతానా!' అని పగటి కలలు కంటున్నాడు.

000

మేనత్తను చూసి తిరుగు ప్రయాణమవుతోంది సత్తెమ్మ. ఆమెకు ఓ పిల్లవాణ్ణి చూపిస్తూ అంది మేనత్త "ఒసే! ఈడి పేరు సీను. ఒట్టి ఎర్రినాగన్న! పాపం, పడవ పెమాదం ఈడి కుటుంబాన్నంతా పొట్టన ఎట్టుకుంది. దిక్కులేనోడ్ని గాలికి ఇడసలేక నేనే ఇంత గంజి పోస్తున్నా! ఐనా, కాటికి కాళ్లు సాపుకున్నదాన్ని నా సాత యాడయితది? నీ ఎంట పట్నం తీస్కపోయి పెయోజకుణ్ణి సెయ్యి! ఎంతైనా పుణ్యముంటుంది!" అని అర్థించింది.

పట్నం పేరు వినగానే సీను కళ్లల్లో దీపావళి వెలుగు, మనసంతా దసరా పండుగ సంబరం కమ్మేశాయి. ఎలాగైనా తననూ పట్నం తీసుకెళ్లమని సత్తెమ్మకేసి ఆశగా చూశాడు వాడు.

"అమ్మో! ఈ కరువు రోజుల్లో తినడానికి మరో నోరు! ఊహుఁ, నా వల్ల కాదు!" అని అనబోతున్న ఆమె కళ్లముందు నారిగాడు మెదిలాడు.

000

తన పక్కగుడిసెలో ఉండే యాదమ్మ కొడుకు నారిగాడు. పదేండ్లోడు. రోజూ చెత్త కుండీలను గాలిస్తూంటాడు. పాలకవర్లూ, చిత్తు కాగితాలూ, పనికిరాని సామానులను ఏరుకుని అమ్ముతాడు. పదిహేను ఇరవై రూపాయలకు తగ్గకుండా వాళ్ల అమ్మ చేతిలో పోస్తూంటాడు. ఐనా, తిండికెంత ఖర్చవుతుందీ! తన ఆలోచనని బయటపెట్టకుండా సీనుని తీసుకుని టౌనుకు తిరిగి వచ్చింది.

సత్తెమ్మ బతకనేర్చిన మనిషి. డబ్బుకీ, ప్రాణానికీ లంకె. ఆవిడ ధాటికి ఝడిసి మొగుడు దేశాలపాలయ్యాడని అందరూ చెప్పుకుంటారు.

సీను గుడిసెల వద్దకు వస్తూనే కోలాహలం పలకరించింది.

తప్ప తాగొచ్చిన భర్తని బండబూతులు తిడుతూ ఏడుస్తోంది ఓ ఇల్లాలు. ఆ చోద్యాన్ని మాసిన ముఖాలతో వేడుకగా చూస్తున్నారు కొందరు జనాలు. ఇవేమీ పట్టనట్టు చెట్టుకింద చింపిరి జుట్లు, చిరిగిన చొక్కాలతో గోలీకాయలు ఆడుకుంటూ పిల్లలూ.

ఆ పక్కే మురికి గుంట. అందులో పందుల జలకాలాటను చూసిన సీను బిక్కముఖం వేశాడు. మల్లేసు చెప్పిన జిలుగు వెలుగులకోసం ఆత్రంగా చుట్టూ చూశాడు. పూరి గుడిసెలు ఫక్కున నవ్వాయి. కనుచూపు మేరలో కనీసం మేడ కూడా కనిపించకపోవడంతో ఉసూరుమన్నాడు. తనుండేది అక్కడే అని తల్చుకోగానే ఏడుపొచ్చినంత పనయింది.

"ఏంద్రా! బయట్నే నచ్చినావు? లోనికి రా!" అని విసుక్కుంది సత్తెమ్మ.

విస్తుపోయాడు సీను. ఆమె మాట కటువునకు. ఒదిగి ఒదిగి పాకలోకి కాలు పెట్టాడు.

బట్టలు పెట్టుకునే పెద్ద చెక్కపెట్టె, దాని పైన గోడకు దేవుడి ఫొటో, చిలుమూరిన డబ్బాలు, సత్తుగిన్నెలు .... నిరుత్సాహంగా చూస్తున్న వాడల్లా ఉలిక్కిపడ్డాడు "తుమ్మ మొద్దులా నిలబడ్డావేందిరా?" అన్న సత్తెమ్మ పిడుగుపాటు ధ్వనికి. కంగారు కంగారుగా చేతులు కట్టుకుని ఆమె ముందుకు వచ్చాడు.

"ఆ పొరక తీస్కో! ఇల్లంతా కన్నెగా ఊడ్సు!"

చప్పున పొరకందుకున్నాడు.

"ఎంతసేపు ఊడ్సిందే ఊడ్సుతావురా! ఇట్లాగైతే తెల్లార్తది!" అని చిటపటలాడుతూ, "అద్గో .... ఆడ కనిపిస్తోందే, బోరింగు .... ఎల్లి బేగీన నీళ్లు తీస్కరా!" అంటూ బిందెను ఇచ్చింది.

అయిష్టంగా బిందెను అందుకుని బయటకు నడిచాడు వాడు.

ఎంతకూ నీళ్లు రాని బోరింగును కొడుతూ ఉంటే బిందె నిండలేదు. చొక్కా మాత్రం బాగా తడిసింది. వగరుస్తూనే అరచేతులను చూసుకున్నాడు. ఎర్రగా కంది ఉన్నాయి. వాటిని చూడగానే కళ్లల్లో కారుమేఘం తొంగి చూసింది.

"సీనూ! ఒరే....! యాడ సచ్చినావురా?" అన్న సత్తెమ్మ స్వరానికి బయట కూర్చున్నవాడు ఒక్క పరుగున ఆమెముందు వాలాడు.

"అంగడి కాడ్కి పోయొస్తా! సంటిదాన్ని సూస్తూండు! సప్పుడు సేయక! పిల్ల లేస్తది!" అని, బిడ్డకేసి మురిపెంగా చూస్తూ వెళ్లింది.

ఆమె అటు వెళ్లగానే పాప నిద్ర లేచి ఏడవడం మొదలుపెట్టింది. వెళ్లిన సత్తెమ్మ ఎంతకూ తిరిగి రాలేదు. సీను ఎంత బుజ్జగించినా పాప ఏడుపూ మానలేదు. ఇంతలో ఆమె వచ్చింది. బిడ్డ ఏడుపు వింటూనే శివాలెత్తిపోయింది. ఆవేశంగా వాడి రెండు బుగ్గలనూ ఛెళ్లు ఛెళ్లుమని వాయించింది.


ఊహించని సంఘటనకు నిముషకాలం చిత్తరువయ్యాడు. మెల్లగా చేతిని చెంపవద్దకు పోనిచ్చాడు. బూరెల్లాగా పొంగిన చెక్కిళ్లను సుతారంగా నిమురుకున్నాడు. దుఃఖం కట్టలు తెంచుకుంది. భోరున ఏడ్చాడు.

పట్నం మోజు మొదటిరోజే వాడి కళ్ల నీరు చూసింది.

సీనూకి పట్నంకన్నా నారిగాడి స్నేహమే బాగా నచ్చింది. కబుర్లు చెప్పుకుంటూ ఊరంతా తిరగడం, చెత్తకుండీలలో దొరికిన సామానును పోగుచేయడం వాడికొక ఆటలా ఉంది.

మసక వెలుగులో చెత్త కెలుకుతున్నాడు ఓరోజు. చేతికేదో మెత్తగా తగిలింది. ఏమనుకున్నాడో ఏమో .... పైకి ఎత్తాడు. చచ్చిన పిల్లి శవం! కెవ్వున కేక వేస్తూ ఒక్కడుగు వెనక్కు వేశాడు. కస్సున గాజుముక్క పాదంలో దిగింది. "అమ్మా!....." అని బాధతో అరిచాడు. వర్షిస్తున్న కళ్లతో వీధి లైటు వద్దకు వచ్చాడు. గాజు ముక్కను బయటకు లాగేసరికి చివ్వున రక్తం చిమ్మింది. ఎర్రటి రక్తాన్ని చూడగానే వాడి బాధ మరింత అధికమైంది. పక్కనే పడి ఉన్న గుడ్డపీలికతో గట్టిగా కట్టు కట్టుకున్నాడు. కాళ్లీడ్చుకుంటూ ఇల్లు చేరి ముసుగుపెట్టి పడుకున్నాడు.

దఢాలున తలుపు తెరిచింది సత్తెమ్మ. ఆమె మనసంతా చిరాకు .... యజమానురాలు



అనవసరంగా తిట్టినందుకు. కుతకుతలాడుతున్న ఆమె కోపాగ్నికి సీనూ మూలన కనిపించి ఆజ్యమయ్యాడు.

"ఏరా...., పనికిపోకుండా పండుకున్నావా?" అని హుంకరిస్తూ జుట్టు పట్టుకుని మరీ లేపింది.

బిత్తరపోయాడు సీను. నిద్రమత్తులోంచి తేరుకునే లోపే ఒంటిపై సలాకి నర్తించసాగింది. పూనకం వచ్చినదానిలా గొడ్డున బాదినట్టు బాదుతున్న ఆమె రెండు కాళ్లనూ పెనవేసుకుని, "కొట్టద్దత్తా!" అని గుండెలు పగిలేలా ఏడుస్తూ వేడుకుంటున్నాడు. అప్పటికిగానీ యజమానురాలిపై ఉన్న కసి ఆ విధంగా తీరలేదు. మరునాడైనా డబ్బులు తీసుకురాకపోతే ఇంటి గుమ్మం తొక్కనివ్వనని ఆంక్ష విధించింది. అప్పుడర్థమైంది వాడికి పట్టణం యొక్క కృతిమత్వం, మనుషుల్లోని పైశాచికత్వం!

తెల్లవారింది. ఒళ్లు నొప్పులు, జ్వరం. అయినా సత్తెమ్మ హృదయం చలించలేదు. ఎంత లేపినా లేవని సీను ముఖంపై విసురుగా చన్నీళ్లను చల్లింది. దిగ్గున లేవలేకపోయాడు.

"అత్తా....! కళ్లు తిరుగుతున్నాయి!" అని ముద్దగా అన్నాడు.

"ఓయబ్బో ...! ముంత నీళ్లకే ఉలిక్కిపడితే, కడవ నీళ్లకు ఎట్లా తట్టుకుంటావు నాయనా?" అని వెక్కిరిస్తూ, భుజానికి సంచిని తగిలించి నిర్దాక్షిణ్యంగా బయటకు నెట్టేసింది.

చలిగాలి. నిండుగా జ్వరం. రాత్రి పస్తు ... కొంతదూరం నడిచాడో లేదో దబ్బున కిందపడ్డాడు.

అటుగా వెడుతున్న యాదమ్మ ఇది చూసింది. కంగారు పడుతూ వెళ్లి సత్తెమ్మకు చెప్పింది. ఇక తప్పదన్నట్టు ... స్పృహ తప్పినవాణ్ణి ఆసుపత్రికి తీసుకెళ్లింది. సణుక్కుంటూ గొణుక్కుంటూ వైద్యం చేయించింది. పదిహేను రోజులకు కానీ సీను మామూలు మనిషి కాలేకపోయాడు.

"దొంగ సచ్చినోడా! ఇన్నాళ్ల సంపాదనంతా మాయదారి రోగానికే తగలేశావు కదరా! ఇద్గో సెప్తున్నా .... రేపటినించి ఇరవైకి తక్కువ తీసుకొచ్చావో నా సంగతి తెల్సుగా...!" అని పళ్లు నూరింది.

భయంభయంగా తలూపాడు పడుకుని ఉన్న సీను.

000

ఆ రోజు దురదృష్టం సీను జేబుకి చిల్లు రూపంలో తొంగిచూసింది. డబ్బు పడిపోయిందన్న వాస్తవం తల్చుకోగానే గుండె మద్దెల అయింది. ఒక్కసారిగా ముఖమంతా చెమటలు పట్టాయి. ఈ నిజం చెబితే ఎంతకూ నమ్మని సత్తెమ్మ భీకరం గుర్తుకు తెచ్చుకున్నాడు. "అమ్మో...!" అని గుండెలపై చేతులుంచుకున్నాడు బెదురుగా. ఒట్టి చేతులతో ఇంటికెళ్లే ధైర్యం చాలటంలేదు. లోలోపలే మథనపడుతూ నడుస్తున్నాడు భారంగా.

చిల్లరపైసలు చల్లుకుంటూ శవాన్ని తీసుకెడుతున్నారు. పాడె వెనుకగా చిల్లర ఏరుకుంటూ పిల్లల గుంపు. వెంటనే సీనూ కూడా ఆ గుంపులో చేరిపోయాడు. చకచకా పైసలను ఏరుకోసాగాడు.

000

దోసిట్లో చిల్లర వర్షం కురిపిస్తున్న సీనువైపు అదోలా చూసింది సత్తెమ్మ. "ఏరా ...! అంతా సిల్లరే కనపడుతోంది?" అని ముఖం చిట్లించి చూస్తూ, "ఓహో .... అంతా సిల్లరే ఐతే దండిగా కనిపిస్తుంది, లెక్కట్టే ఈలుండదని కదూ నీ తెలివి! నేనేం బండదాన్ని కాదు, నీ ఏషాలు నాకాడ సూపించకు!" అంటూ నెత్తిన మొట్టికాయ కుక్కింది.

సీను కళ్లనుండి గిర్రున నీళ్లు తిరిగాయి. 'అమ్మా వాళ్లతో చచ్చిపోయి ఉంటే ఎంత బావుండేది! రెండేండ్ల నుండి డబ్బులు తీసుకుని వస్తున్నా, అత్తకు ఎంతకూ తృప్తి లేదు, ఛ!' అనుకున్నాడు విరక్తిగా.

సత్తెమ్మ పొయ్యి వెలిగించి ఎసరు పెట్టింది. ఇంతలో యాదమ్మ కబురు మోసుకొచ్చింది. "ఒరే మొద్దు! అమ్మగారెందుకో పిలిసారట! ఎల్లస్తా! అన్నం ఉడగ్గానే దించేయి! అసలే నిద్ర మొహంగాడివి, పిల్ల జాగ్రత్త!" అని పరుగందుకుంది సత్తెమ్మ.

ఎదురుగా నులక మంచం. దానిమీద మూడేండ్ల పాప హాయిగా నిద్రపోతోంది. పాపకేసి చూస్తూ సీను అలాగే నిద్రలోకి జారుకున్నాడు. అలా ఎంతసేపు ఉన్నాడో! మాడు వాసన రావడంతో మెలకువ వచ్చింది. పొయ్యి ఎప్పుడు ఆరిపోయిందో.... పాకంతా అప్పుడే పొగ కమ్ముకుంటోంది. ఏమి జరిగిందో అర్థమైన వాడి గుండెలు జారిపోయాయి.

'అమ్మో! అత్త వచ్చిందంటే .... రాక్షసి! చంపేస్తుంది. బయటకు పారిపోతేనో?' గభాల్న లేచాడు. ఎదురుగా మంచంపీద పాము. పాకుతూ కళ్లబడింది. "అమ్మో.... పాము!" భయంతో అసంకల్పితంగా అరిచాడు. పాము ఒక్కసారిగా ఠక్కున ఆగిపోయింది. శబ్దం వచ్చిన దిక్కు తోకపై నిలబడి చూసింది. వెంటనే వెనకా ముందూ ఆలోచించకుండా ఒక్క అంగలో దానిముందుకు దూకాడు. తాచుపాము మెడ దగ్గర గట్టిగా పట్టుకుని సర్రున ఇవతలకు లాగాడు. తన దారికి అడ్డు తగిలాడన్న పిచ్చి కోపంతో కసిగా కాటేసింది. అయినా దాన్ని వదల్లేదు. వదిలితే పాపకు హాని కలిగిస్తుందన్న భీతితో అలాగే గట్టిగా పట్టుకుని నేలకేసి బాదాడు బలంగా.

జరిగినదంతా శిలా ప్రతిమలా గుమ్మంలోంచే చూస్తున్న సత్తెమ్మలో ఒక్కసారిగా చలనం ...! ఒక్క పరుగున ముందుకు దూకింది. వాలిపోతున్న సీనుని ఆత్రంగా ఒడిలోకి తీసుకుంది.

"అత్తా! పాప ..." అస్పష్టంగా గొణిగాడు.

"సీనూ ...!" గొల్లుమంటూ ఆత్మీయంగా గుండెలకదుముకుంది.

"నా బిడ్డను ఆదుకోబోయి నీ ప్రాణాలమీదకు తెచ్చుకున్నావు కదరా! ఏం సేసి నీ ఋణం తీర్చుకోగలను? ఇన్నాళ్లూ పిల్లగాడవని సూడకుండా పీడించకతిన్నా! ఐనా నా మీదెందుకురా ఇంత కనికరం...!" ధారాపాతంగా ఆమె కళ్లల్లోంచి ఆర్తి కురుస్తోంది. ■

